క్లుప్తంగా

పత్తాలేని అధికారులు


దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

బజార్‌హత్నూర్: కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆయా సమస్యలపై 10 దరఖాస్తులు రాగా.. తహసీల్దార్ శ్యాంసుందర్, ఏవో ఎండీ గౌస్ మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో జెడ్పీ కార్యాలయంలో సమావేశానికి వెళ్లగా.. మిగతా అధికారులు ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, అటవీ శాఖ, ఎంఈవో, వైద్యశాఖ, పోలీస్, ఎక్సైజ్, ఐసీడీఎస్, ఈజీఎస్, పీఆర్, విద్యుత్, హార్టికల్చర్ శాఖల నుంచి ఒక్కరూ కూడా హాజరు కాలేదు.

మున్సిపల్ కార్మికులపై పనిభారం తగ్గించాలి

ఆదిలాబాద్‌టౌన్: మున్సిపల్ కార్మికులపై పని భారం తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు పారిశుధ్యంతో పాటు ఇతర పనులు చెప్పడంతో వారికి పనిభారం అవుతుందని, దీన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికుడికి రెండు జతల యూనిఫాం, కుట్టు కూలీ ఇవ్వాలని, బ్లౌజులు, సబ్బులు, నూనె, బెల్లం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, మంతెన కాంతరావు, చిరంజీవి, నారాయణరెడ్డి, ఊశన్న, సురేశ్, లక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే చర్యలు

ఇచ్చోడ: గంజాయి సాగు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ సీఐ బండారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిహత్నూర్‌లో 10, సిరికొండలో 13 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేస్తున్న వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సంత్ పాచు బాబా చౌక్ ప్రారంభం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అందునాయక్‌తండా గ్రామం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సంత్ పాచు బాబా చౌక్‌ను సోమవారం ప్రారంభించారు. అందునాయక్‌తండా జ్వాలముఖి ఆలయ మహరాజ్ రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డొంగ్రె, సోన్‌కాంబ్లే జితేందర్, చోపడే ఫకీరానాయక్, సాబ్లే దశరథ్, చందర్‌సింగ్ పద్వాల్, దేవ్‌పూజే మారుతి, సుంకట్‌రావ్ పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న తుల శ్రీనివాస్

బోథ్: బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీసేవాలాల్ మహరాజ్ శిష్యుడు శ్రీ సంత్ రామారావు మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు సొనాల మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం భూమిపూజ చేశారు. విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయిస్తానని, మండలంలోని అన్ని కులాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సురేందర్ యాదవ్, తుల హరీశ్, ఇర్ల అభిలాష్, అల్లకొండ ప్రశాంత్, అంజి, భగవాన్ దాస్, జాదవ్ రాంకిషన్, బాబులాల్, గులాబ్‌సింగ్, రాథోడ్ నారాయణ పాల్గొన్నారు.

లా సెక్రెటరీని కలిసిన ఏజీపీ పంద్రం శంకర్


లా సెక్రెటరీని కలిసి సన్మానిస్తున్న శంకర్

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ పంద్రం శంకర్ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో లా సెక్రెటరీ బి. పాపిరెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజీపీ శంకర్, లా సెక్రటరీని శాలువాతో సత్కరించారు. భేటీలో బోథ్ నూతన కోర్టు భవన నిర్మాణ పనులు జరుగుతున్న తీరును, వాటి పురోగతిని లా సెక్రటరీకి వివరించినట్లు తెలిపారు.

చెట్లపై గొడ్డలివేటు..!


పొన్నారి రోడ్డుకు ఇరువైపులా నరికిన చెట్లు

- రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేస్తున్న విద్యుత్ సిబ్బంది
- వృథా అవుతున్న ప్రజాధనం

తాంసి: ప్రతీ ఏటా ప్రభుత్వం పచ్చదనం పెంచేందుకు విరివిగా మొక్కలను నాటిస్తుంది. నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ మండలంలో అధికారులు మాత్రం మొక్కలను నాటుతూనే.. చెట్లను నరకండి అనే చందంగా వ్యవహరిస్తున్నారు. పచ్చదనం పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడడంతో ఏపు పెరిగిన తరువాత అధికారులు వాటిని కొట్టి వేయిస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరాకు తరుచూ అంతరాయం కలిగిస్తున్నాయి.

అడ్డుగా ఉన్న చెట్లు తొలగింపు..

మండలంలోని పొన్నారి నుంచి తాంసి వరకు వెళ్లే మార్గంలో పలు గ్రామాల సమీపంలో రోడ్లకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. రోడ్డు పక్కన ఆహ్లాదం పంచుతున్న చెట్లను, కొమ్మలను విద్యుత్‌శాఖ సిబ్బంది నరికి వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొన్నారి సమీపంలో అంతర్రాష్ట్ర రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కల వాహనదారులకు ఆహ్లాదం, నీడను ఇస్తున్నాయి. విద్యుత్ తీగల కింద ఉండడంతో వాటిని నరికివేస్తున్నారు. దీంతో ఎందుకు చెట్లను నరికివేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరికి వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి



పచ్చదనాన్ని పెంచడం కోసం ప్రభుత్వం ప్రతీ ఏటా మొక్కలను నాటి సంరక్షిస్తుంది. మొక్కలను వివిధ కారణాలతో నరికివేస్తే నాటిన మొక్కలు పెరిగిన ప్రయోజనం లేకుండా పోతుంది. ప్రతీ ఏటా విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలను అధికారులు నరికేస్తున్నారు. తీగలు లేని ప్రత్యామ్నాయ స్థలాల్లో మొక్కలు నాటాలి.

– నవీన్ కుమార్‌యాదవ్, తాంసి

కొలువుదీరిన దుర్గామాత


ఇచ్చోడ: టీచర్స్‌కాలనీలో మంగళహారతులతో మహిళలు

ఇచ్చోడ/ఆదిలాబాద్‌రూరల్/ఇంద్రవెల్లి/బోథ్/తాంసి: జిల్లా వ్యాప్తంగా భక్తులు అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో సోమవారం దుర్గామాత కొలువుదీరింది. దుర్గామాతను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భవాని దీక్షలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని నవశక్తి దుర్గామాత ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. సొనాల మండలంలోని సాకెర గ్రామంలోని దుర్గాదేవి ఆలయాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


బోథ్: కొలువుదీరిన దుర్గామాత


తాంసి: విగ్రహాన్ని తీసుకొస్తున్న మహిళలు


ఆదిలాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న భక్తులు


ఇంద్రవెల్లి: హీరపూర్‌లో ప్రతిష్ఠిస్తున్న భక్తులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సోమవారం రాజ్‌గోండు సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల ఆదివాసీ గిరిజనులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అన్యాయం జరిగిందన్నారు. మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా మండల కేంద్రానికి 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని ప్రశ్నించారు. అనర్హులకు ఇళ్లు కేటాయించరని అన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండు సేవా సమితి జిల్లా నాయకులు చత్రుషావ్, జలీంషావ్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత, పొదుపు పాటించాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నార్నూర్: విద్యుత్ భద్రత, పొదుపు సూచనలను వినియోగదారులు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్‌యార్డ్ సమీపంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. తెగిపడిన విద్యుత్ తీగలను, వర్షాల కారణంగా విరిగిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాల జరుగుతున్నాయని, వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమతి లేని వ్యక్తులు విద్యుత్ మరమ్మతులు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎల్ఐ శంకర్, లైన్‌మెన్ రాథోడ్ రవీందర్, రవీందర్, శ్రీనివాస్, సిబ్బంది తారాచంద్, దేవిదాస్, సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో సోమవారం మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళల ఉదయాన్నే పూలతో బతుకమ్మలను పేర్చి, పూజలు చేశారు. డీజే బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ, కోలాటం ఆడారు. అనంతరం గ్రామ సమీపంలోని కడెం వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండల యువ నాయకుడు గోపు అనిల్ యాదవ్ తండ్రి శంకర్ యాదవ్‌ను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. అనారోగ్యంతో నిర్మల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తె లుసుకొని సోమవారం ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నా రు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గజేందర్‌కు కృతజ్ఞతలు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామస్తుల అభ్యర్థన మేరకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఐదు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయగా.. ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గజేందర్ మాట్లాడుతూ.. పొచ్చెర గ్రామానికి అన్నివిధాలా అండగా ఉంటానని, భవిష్యత్‌లో ఎలాంటి అవసరం ఉన్నా.. తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్. నవీన్‌రెడ్డి, గంగారెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రవీణ్, ఆశన్న, రాజేశ్వర్, రాజేశ్వర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

ఉట్నూర్‌రూరల్: సాయితేజ ఆత్మహత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఆమె హైదరాబాద్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని బాధిత కుటుంబానికి మద్దతు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట చారులత రాథోడ్ స్థానికులతో కలిసి ధర్నా చేపట్టారు.

కొనసాగుతున్న సమ్మె

ఉట్నూర్‌రూరల్: న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 11 రోజులకు చేరుకుంది. సమ్మెకు ప్రజాసంఘాల నాయకులు నేతావత్ రాందాస్ నాయక్, బానోత్ జగన్ నాయక్, బానోత్ రామారావు, ప్రజ్ఞ శీల్, జాడి వెంకటేశ్‌లు మద్దతు తెలిపారు. వెంటనే నాల్గొవ తరగతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజన్న, రాథోడ్ బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలో ప్రభాకర్‌రెడ్డి

కైలాస్‌నగర్: పంజాబ్ రాష్ట్రం చండిగఢ్‌లో సోమవారం జరిగిన సీపీఐ 25వ జాతీయ కాంగ్రెస్ మహాసభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి ఐదుగురు ప్రతినిధుల బృందం హాజరుకాగా అందులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆయన పాల్గొన్నారు.

పేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సర్ల లక్ష్మికి మంజూరైన రూ. 60 వేల చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా సిరికొండ మండలంలోని సాత్మోరి గ్రామానికి చెందిన కుమ్ర దీపక్ ఇటీవల యూజీసీ సెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాడు. ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలువగా తనవంతు సాయంగా రూ. 5వేల అందించాడు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని డాక్టర్ స్వప్న అన్నారు. సోమవారం మండలంలోని తర్నం(కె) గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఓంప్రకాష్, ఏఎన్ఎంలు సుజాత, గంగామణి, శ్యామల, ఆశ కార్యకర్త ఆనందబాయి పాల్గొన్నారు.

ఇచ్చోడ: స్వస్థనారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా చేపడుతున్న ప్రత్యేక వైద్య శిబిరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా టీబీ ప్రోగాం ఆఫీసర్ సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. టీబీ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు స్రవంతి, కిరణ్‌కుమార్, సీహెచ్‌వో బ్రహ్మానందంరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, సూభాష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరాలు

ఇచ్చోడ: స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తలమడుగు: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హరీశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండలంలోని కోత్తుర్, డోర్లి, రుయ్యాడి గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు శివ నగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిచెల్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ: జిల్లాలో అతిపురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో కలిసి తెప్పపై ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. దేవి నవరాత్రుల ఉత్సవాలను ప్రజలు ప్రశాంత జరుపుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నేరడిగొండ: మండలంలోని గుత్పాల గ్రామానికి చెందిన గెడం గిరిజా బాయికు మంజూరైన రూ.60వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారునికి ఈ చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దుర్గాదేవి ఆశీర్వాదం ప్రజలపై ఉండాలి

నేరడిగొండ: దేవీ నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మండలంలోని రాజురా గ్రామంలో గల దుర్గాదేవి ఆలయంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. దేవి ఆశీర్వాదాలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు.

వైద్యులను నియమించాలి


మాట్లాడుతున్న భిక్షపతి రాథోడ్

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నియమించాలని డిమాండ్ చేస్తూ.. అమర నిరాహార దీక్ష చేపడుతున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి రాథోడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు లేక నిరుపేద ఆదివాసీ గిరిజనులు వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. చిన్నచిన్న వ్యాధులకు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని మండిపడ్డారు. వైద్యుల నియమించేంతవరకు అమర నిరాహార దీక్ష చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు సీహెచ్ ప్రకాష్, దేవాదాస్, పరశురాం రాథోడ్, మోహన్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ఈనెల 24న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఆదివాసీ పెద్దలు, సంఘాల నాయకులు, యువత తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుర్క చిత్రు, జుగ్నాక్ భరత్, సోయం రాందాస్, ఆత్రం ధర్ము, హరిదాస్, నాగ్‌నాథ్, కనక గణేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


కైలాస్‌ను సన్మానిస్తున్న పాఠశాల యజమాన్యం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు పీఎం మన్‌కీ బాత్‌లో ప్రశంసలు అందుకొని ఇటీవల రాష్ట్రపతి విందు కార్యక్రమంలో పాల్గొని వచ్చిన తొడసం కైలాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంటే నిరంతర విద్యార్థిగా ఉండాలని, నూతన టెక్నాలజీకి అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ షబ్బీర్ అహ్మద్, ప్రిన్సిపాల్ పర్వీణ్, జబడే రవి, ఉపాధ్యాయులు, తదితరవులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

బోథ్: సొనాల గ్రామంలోని రామాలయంలో సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు తొమ్మిది రోజుల పాటు శ్రీ సీతారామచంద్ర స్వామి దశవార్షిక నవరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలను అందరూ కలిసికట్టుగా ఉండి విజయవంతం చేయాలని, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఉత్సవాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఉట్నూర్‌రూరల్: పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంకంటి సుభాష్ ఆధ్వర్యంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా.. అధికారులు స్పందించడం లేదన్నారు. వేతనాలు విడుదల చేస్తామని హామీ ఇస్తున్నా.. నెరవేర్చడం లేదన్నారు. రెండు రోజుల్లో వేతనాలు ఇవ్వకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఉద్యమం తీవ్రస్థాయి చేస్తామని హెచ్చరించారు.